కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుదాం

- కార్మికుల జీవితాలను ఆగం చేసింది
- పేదల పాలిట దేవుడు కేసీఆర్
- మెదక్ గడ్డ..గులాబీ అడ్డా
- బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం
- ఆటో కార్మికులతో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు టెలి కాన్ఫరెన్స్

టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 19: 'కాంగ్రెస్ అంటేనే మోసం... కష్టాలు అనే మాటకు నిదర్శనం.. మన కళ్ల ముందే ఆటో కార్మికుల జీవితాలు ఆగమయ్యాయి' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట ఆటో కార్మికులతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిద్దిపేట ఆటో కార్మికుల కోసం ప్రతి పండుగకు కొత్త బట్టలు ఇస్తున్నాని చెప్పారు. ఆటోలక్ష్మి కింద రూ. 5వేలు, కార్మికులు చనిపోతే రూ.2లక్షలు, పిల్లల చదువు కోసం ఇలా ఎన్నో సహాయ సహకారాలు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల జీవితాలను ఆగం చేసిందన్నారు. సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని మాట తప్పింది, నెలకు రూ.10 వేల జీవన భృతి ఇవ్వాలని అసెంబ్లీలో కొట్లాడితే నోరు మెదపని ఈ ప్రభుత్వానికి వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని మోసం చేసిందన్నారు. రైతు బంధు రూ. 15వేలు, వరి ధాన్యానికి రూ.500 బోనస్, మహిళలకు రూ.2,500, కల్యాణ లక్ష్మి కింద రూ.లక్ష రూపాయతోపాటు తులం బంగారం ఇస్తానని మోసం చేసిందన్నారు. నిరుద్యోగులకు రూ.4 వేల నిరుద్యోగ భృతి , పింఛన్ రూ.4 వేలు, ఆడపిల్లలకు స్కూటీ ఇస్తానని మోసం చేసి గద్దె నెక్కిందన్నారు. రాష్ట్రంలో 40 మంది ఆటో కార్మికులు చనిపోతే ప్రభుత్వం ఆదుకోలేదని, ఒక మంత్రి, ఒక ఎమ్మెల్యే కూడా పరామర్శించకుండా పట్టించుకోలేదని విమర్శించారు. మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రఘునందన్‌రావు ఒక అబద్ధాల పుట్ట అని.. సిద్దిపేట అభివృద్ధిని చూసి ఓర్వలేని వాడన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.60 ఉన్న పెట్రోల్, డీజిల్ ధరలను రూ.100 చేసిందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ప్రజల బ్యాంకు ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోసం చేసిందన్నారు. మెదక్ గడ్డ..గులాబీ అడ్డా... మెదక్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు.

కుట్రదారులకు చెంపపెట్టు లాంటి తీర్పు

- మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సిద్దిపేట, ఏప్రిల్ 19: జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారనే అబద్ధపు ప్రచారంతో 106 మంది ప్రభుత్వ ఉద్యోగులపై ఎన్నికల సంఘం విధించిన సస్పెన్షన్‌పై హై కోర్టు స్టే విధించడం, వెంటనే వారిని విధుల్లో కి తీసుకోవాలని ఆదేశించడం శుభ పరిణామని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి రఘునందన్ వంటి రాజకీయ కుట్రదారులకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదన్నారు. స్వార్థంతో 106 కుటుంబాల్లో దుఃఖం నింపినప్పటికీ ధర్మమే గెలిచిందన్నారు. వాస్తవాలు ఎప్పటికైనా వెలుగు చూస్తాయని, కుట్రలు ఎప్పటికైనా బయటపడుతాయని మరోసారి నిర్ధారణ అయ్యిందన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబీకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తుదితీర్పు కూడా అనుకూలంగా వస్తుందనే నమ్మకం ఉందన్నారు. రఘునందన్ ఉద్యోగులను అడ్డం పెట్టుకొని రాజకీయ దాడికి పాల్పడ్డాడన్నారు. ఓటర్లు ఇలాంటివారిని తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.

గట్లమల్యాలలో పోస్ట్‌కార్డు ఉద్యమం

గట్లమల్యాలలో పోస్టుకార్డులు పంపిస్తున్న రైతులు

నంగునూరు, ఏప్రిల్ 19: ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనా ఎందుకు ప్రకటన చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని గట్లమల్యాలలో సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు ద్వారా లేఖలు పంపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతుల కోసం ఎన్నో హామీలు ఇచ్చి.. ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. నాడు కేసీఆర్ రైతుల కోసం ఉచిత కరెంట్, రైతు బంధు, రైతు బీమా ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పోచయ్య కుటుంబానికి అండగా ఉంటాం

ఆర్థిక సహాయం అందజేస్తున్న దొమ్మాట ఎంపీటీసీ గన్నమనేని లక్ష్మీమోహన్‌రావు

తొగుట ఏప్రిల్ 19: అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని ఎల్ బంజేరుపల్లికి చెందిన సాకలి పోచయ్య (70) కుటుంబానికి అండగా ఉంటామని దౌల్తాబాద్ మండలం దొమ్మాట ఎంపీటీసీ గన్నమనేని లక్ష్మీమోహన్‌రావు అన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పోచయ్య శుక్రవారం మరణించడం చాలా బాధాకరమన్నారు. ఈ సందర్భంగా పోచయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.4వేల ఆర్థిక సహాయం, 50 కిలోల బియ్యం అందజేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ దొమ్మాట అధ్యక్షుడు సల్ల స్వామి,నాయకులు మంతూరి రమేశ్, మల్లేశం, పడిగ రాజు, నాగరాజు, కురుమ బీరయ్య పాల్గొన్నారు

నేడు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ధూళిమిట్ట మండలంలోని ఆరు గ్రామాల్లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ఏడు గంటలకు కూటిగల్, రెడ్యానాయక్‌తండా, తొమ్మిది గంటలకు కొండాపూర్, దుబ్బతండా, హనుమతండా, 10:30 గంటలకు బెక్కల్, మధ్యాహ్నం 12:30 గంటలకు లింగాపూర్, సాయంత్రం ఐదు గంటలకు జాలపల్లి, ఆరు గంటలకు ధూళిమిట్ట గ్రామాల్లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశాలకు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

అర్హులకు ఉపాధి కల్పించాలి

జగదేవ్‌పూర్ ఏప్రిల్19: జాబ్‌కార్డు కలిగిన వారందరికీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా పని కల్పించాలని అడిషనల్ డీఆర్డీవో బాలకృష్ణ, ఎంపీడీవో యాదగిరి అన్నారు. శుక్రవారం మండలంలోని రాయవరం, బీజీవెంకటాపూర్, మునిగడప గ్రామాల్లో వారు పర్యటించి ఈజీఎస్ ద్వారా చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. అనంతరం ల్యాండ్ లెవలింగ్, నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్వర్మ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచార రథం ఢీకొని రైతు మృతి

గజ్వేల్, ఏప్రిల్ 19: కాంగ్రెస్ ప్రచార రథం ఢీకొని రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని రిమ్మనగూడలో చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సాక్కి మల్లేశం(38) వ్యవసాయ పనుల నిమిత్తం శుక్రవారం ట్రాక్టర్ తీసుకొని ప్రజ్ఞాపూర్ వైపు వెళ్తుండగా రాజీవ్ రహదారిపై వెనుక నుంచి వచ్చిన కాంగ్రెస్ ప్రచార రథం బలంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న మల్లేశం రోడ్డుపై పడటంతో అక్కిడికక్కడే మృతి చెందాడు. ఢీకొన్న డీసీఎం ఆపకుండా ముందుకెళ్లడంతో గమనించి వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే అతను మృతి చెందడంతో మృతదేహన్ని గజ్వేల్ మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎన్నికల వ్యయాలను పక్కాగా లెక్కించాలి

అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్ కుమార్ రాజ్‌వన్షీ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 19: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయాలను పక్కాగా లెక్కించాలని మెదక్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్ కుమార్ రాజ్‌వన్షీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిద్దిపేట కలెక్టరేట్‌ను సందర్శించి ఎక్సైజ్, ఐటీ అధికారులు, ఎన్నికల అసిస్టెంట్ వ్యయ అబ్జర్వర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ, తదితర నిఘా బృందాల ద్వారా సీజ్ చేసిన అక్రమ నగదు, లిక్కర్ రవాణా వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల బృందాలన్నీ పకడ్బందీగా పనిచేసి లోక్ సభ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో మద్యం, లిక్కర్ ప్రభావం చూపకుండా చూడాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల అసిస్టెంట్ వ్యయ అబ్జర్వర్లు ఫీల్డ్ విజిట్ చేసి ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాల పనితీరును పర్యవేక్షించాలని, వారి వద్ద గల రికార్డులను పరిశీలించి అక్రమంగా తరలించే మద్యం, నగదు గుర్తించి సీజ్ చేయాలన్నారు. మీడియా సెంటర్, ఇంటిగ్రేటెడ్ ఎలక్షన్ మానిటరింగ్ సెల్‌ను పరిశీలించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌లను గుర్తించాలన్నారు. సీ విజిల్, 1950 కాల్ సెంటర్, ఎఫ్ఎస్‌టీ వెహికిల్ జీపీఎస్ మానిటరింగ్ సిస్టమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌టీ శిబిరం పరిశీలన

మండల పరిధిలోని పొన్నాల గ్రామ శివారు నాగులబండ వద్ద రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ శిబిరాన్ని శుక్రవారం మెదక్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్ కుమార్ రాజ్‌వన్షీ, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మను చౌదరితో కలిసి పరిశీలించారు. ఈ మేరకు ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. రోజు వారీ రిపోర్టులను పొందుపర్చే రికార్డులను పరిశీలించారు. ఎల్లప్పుడూ నిఘా ఉండేందుకు సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా అత్యంత పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శివాజీ

చేర్యాల, ఏప్రిల్ 19 : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కార్యదర్శులు కృషిచేయాలని, గ్రామాల్లో తాగు నీటి సమస్య రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి శివాజీ సూచించారు.పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన వేసవి నీటి ఎద్దడి నివారణ చర్యలు, ఉపాధి హామీ పనుల పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి ట్యాంకులను తప్పక క్లోరినేషన్ చేయించాలని, ట్యాంకులపై కవర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైన్ల లీకేజీలు ఉంటే వెంటనే వాటికి మరమ్మత్తులు చేయించాలన్నారు .ఉపాధి హామీ పనులకు కూలీలు తప్పక హాజరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని, పనులు చేసే ప్రదేశంలోఅన్ని వసతులు కల్పించాలన్నారు.ఎండ తీవ్రత నేపథ్యంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని సూచించారు. మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ, ఉపాధిహామీ ఏపీవో మంజుల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం చెబుదాం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఏప్రిల్ 19: గడిచిన పదేండ్లలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్లకే కొమ్ముకాస్తూ పేద, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని రవాణా బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని శుభంగా గార్డెన్స్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరులను ప్రధాని మోదీ అవమానించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రధాని మోదీకి గట్టి దెబ్బ కొట్టాలన్నారు. కరీంనగర్ బీజేపీ ఎంపీగా బండి సంజయ్ చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, హుజూరాబాద్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు, వెలిచాల రాజేందర్‌రావు, కోడూరి సత్యనారాయణ, కేడలం లింగమూర్తి, బొలిశెట్టి శివయ్య, బస్వరాజు శంకర్, మంద ధర్మయ్య, జంగపల్లి అయిలయ్య, వల్లపు రాజు, పున్న సది పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న శ్రీనివాస్

గజ్వేల్, ఏప్రిల్ 19: ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమయ్యే కూలీలు ఎండల తీవ్రత నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండలంలోని అక్కారంలో ఉపాధి కూలీలు పనులు చేసేప్రదేశానికి ఆయన ఆకస్మికంగా చేరుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, అందుకు ఉదయం 11గంటల్లోపు పనులు ముగించుకోవాలన్నారు. కళ్లు తిరిగిన సమయంలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ప్రత్యేకాధికారి ఆరీఫా, వైద్యులు డాక్టర్ బల్బీర్‌సింగ్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మిరుదొడ్డి, ఏప్రిల్ 19: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు రానివ్వకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీపీవో దేవకీదేవి అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి ఎంపీడీవో కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లలో ఎక్కడ కూడా జాప్యం జరుగవద్దని సూచించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు తమ విధులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎల్‌పీవో మల్లికార్జున్, మిరుదొడ్డి ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, ఎంపీవో జహీరొద్దీన్, మిషన్ భగీరథ ఏఈ రోహిత్,ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంటా అయ్యేనా...రైతు తేరుకునేనా..

హుస్నాబాద్‌లో మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం మధ్యనే కునుకు తీస్తున్న రైతు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 19: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించేందుకు వచ్చిన రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. పంట కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ధాన్యం కుప్పల మధ్యనే రైతులు ఇలా కునుకుతీయాల్సి వస్తున్నది. శుక్రవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇలా రైతు కునుకు తీస్తూ కనిపించాడు.

శోభాయాత్రకు విరాళం

గజ్వేల్, ఏప్రిల్ 19: ఈనెల 23న నిర్వహించే వీరహనుమాన్ శోభాయాత్రకు మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి రూ.30వేల విరాళాన్ని శుక్రవారం నిర్వాహకులకు అందజేశారు. బహుబలి ఆంజనేయస్వామి విగ్రహానికి తనవంతు విరాళం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు సంతోష్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

గజ్వేల్, ఏప్రిల్ 19: అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్న బెల్ట్‌షాపుపై కుకునూర్‌పల్లి పోలీసులు గజ్వేల్ మండలం కొడకండ్లలో శుక్రవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన కొండ శ్రీనివాస్ తన కిరాణా దుకాణంలో అక్రమంగా బెల్ట్‌షాపు నడిపిస్తుండగా అందులో 22.475 లీటర్ల విస్కీ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రామచంద్రాపూర్‌లో..

హుస్నాబాద్, ఏప్రిల్ 19: కోహెడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామచంద్రాపూర్‌లో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కోహెడ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి పట్టుకున్నారు. కోహెడ పోలీ సులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కనకయ్య తన ఇంటిలో ఎలాంటి అనుమతులు లేకుండా బెల్టు షాపు నడుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా బీరు, విస్కీ బాటిళ్లు దొరికాయి. పోలీసులు కనకయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు కాడెద్దు మృతి

జగదేవ్‌పూర్ ఏప్రిల్ 19: పిడుగుపాటుకు కాడెద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని చాట్లపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన భూమల్ల కొండయ్య తన ఎడ్లను చెట్లకు కట్టేసి గడ్డేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసిందని, భారీ శబ్ధంతో పిడుగుపడడంతో చెట్టుకు కట్టేసి ఉన్న ఎద్దు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

కొండగట్టుకు తరలిన హనుమాన్ భక్తులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 19: మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లో 41రోజుల పాటు హన్‌మాన్ మాలధారణ చేసుకొని దీక్ష ఆచరించిన హనుమాన్ భక్తులు శుక్రవారం మాల విరమణ కోసం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా హన్‌మాన్ భక్తులు తెల్లవారుజామునే ఇరుముళ్లు కట్టుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇరుముళ్లు నెత్తిన పెట్టుకొని గ్రామంలో సామూహిక భజనలు, సంకీర్తనలతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, పీఏసీఎస్ సీఈవో బోయిని శ్రీధర్, పీఏసీఎస్ డైరెక్టర్ మేక మల్లేశం, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చెవిటి మహేశ్, బీఆర్ఎస్ మండల నాయకుడు మేక గోపాల్, కారోబార్ బోయిని శ్రీకాంత్, ఉప్పల సత్యనారాయణ, బండి యాదగిరి, అత్కూరి పరశురాములు, ఉల్లెంగల బాలమల్లు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సాయం

రాయపోల్, ఏప్రిల్ 19: దౌల్తాబాద్ మండలం ముబారాస్‌పూర్ గ్రామానికి చెందిన గుట్టమిది యాదమ్మ కుమార్తె పెండ్లికి రూ.5వేలు, తిర్మలాపూర్‌లో పేద వధువు యేసుమని పెండ్లికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం అందజేసినట్లు బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీముద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల యూత్ అధ్యక్షుడు నర్ర రాజేందర్,మాజీ ఎంపీపీ దారా సత్యనారాయణ, దొమ్మట మాజీ సర్పంచ్ మోహన్ రావు, యూత్ మండల నాయకుడు ఖలీలొద్దీన్,నాయకులు వైకుంఠం, మాజీ సర్పంచ్ యాదగిరి, జలంధర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు రాజయ్య, కిష్టయ్య, సెల్మయ్య, రాజు, చంద్రయ్య, నరేశ్, సల్ల స్వామి, దారా స్వామి, బాలాగౌడ్, రాములు, రాజు, పరశురాములు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేయాలి

మాట్లాడుతున్న శ్రీకాంత్‌రావు

గజ్వేల్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని, అప్పుడే గుర్తింపు వస్తుందని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జాలిగామలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. నాయకులు భానుప్రసాద్, విజయ్‌కుమార్, ప్రశాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞాపూర్‌లో రథోత్సవం

గజ్వేల్, ఏప్రిల్ 19: మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో శ్రీరామనవమి రెండో రోజు రాములోరి రథోత్సవం శుక్రవారం సాయంత్రం ప్రారంభమైంది. సీతారాముల దేవాలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం ప్రజ్ఞాపూర్ చౌరస్తా మీదుగా గ్రామంలోని పురవీధుల నుంచి కొనసాగింది. మహిళలు కోలాటం ఆడారు.

అకాలవర్షం..అపార నష్టం

దుబ్బాక మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఏప్రిల్ 19: దుబ్బాక మార్కెట్ యార్డులో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వందల క్వింటాళ్ల ధాన్యం తడిసింది. మరికొందరి రైతుల ధాన్యం వర్షపునీటిలో కొట్టుకుపోయింది. వరి ధాన్యం తడిసిన విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మార్కెట్ యార్డుకు వచ్చారు.తడిసిన ధాన్యంతో ఇబ్బందులు పడుతున్న రైతుల వద్దకు వెళ్లి ఓదార్పి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మద్దతు ధర కోసం రైతులు మార్కెట్‌యార్డుకు ధాన్యం తీసుకొస్తే..కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట దుబ్బాక జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సోలిపేట సతీశ్‌రెడ్డి, కొత్త కిషన్‌రెడ్డి, గన్నే భూంరెడ్డి, ఆస యాదగిరి ఉన్నారు.

సిద్దిపేట మార్కెట్‌లో ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పుతున్న రైతులు

నర్సాయపల్లిలో

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్19: మద్దూరు మండలంలోని నర్సాయపల్లిలో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడిసింది. టార్పాలిన్లు కప్పినా కొంతమంది రైతుల ధాన్యం వర్షంనీటితో తడిసిపోయింది.

ఆకునూరులో..

చేర్యాల, ఏప్రిల్ 19: మండలంలోని ఆకునూరులోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రంలో విక్రయించుకునేందుకు రైతులు తీసుకువచ్చిన ధాన్యం నానిపోయాయి. వర్షం వచ్చే సూచనలు గమనించిన పలువురు రైతులు తమ వెంట తెచ్చుకున్న టార్పాలిన్లు ధాన్యం కుప్పలపై కప్పినప్పటికీ బలమైన గాలులు వీయడంతో షీట్లు ఎగిరిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేర్యాల మండలం ఆకునూరులో వీచిన బలమైన గాలులకు పలువురు రైతులకు చెందిన మామిడి తోటలకు తీవ్ర నష్టం జరిగింది.

మీర్జాపూర్‌లో ..

హుస్నాబాద్, ఏప్రిల్ 19: హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో మామిడి తోటలతోపాటు గ్రామ శివారులోని వరిపంటకు సైతం స్వల్పనష్టం జరిగింది. కల్లాల్లో రైతులు ఆరబోసుకున్న వడ్లు తడిసిపోయాయి.పెద్ద ఎత్తున గాలి రావడంతో మామిడి కాయలు నేలరాలాయి.

నారాయణరావుపేటలో...

నారాయణరావుపేట, ఏప్రిల్ 19:నారాయణరావుపేటతో పాటు లక్ష్మీదేవిపల్లి, గుర్రాలగొంది, మల్యాల, కోదండరావుపల్లి, బంజేరుపల్లి, జక్కాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. మామిడి తోటల్లో మామిడి కాయలు రాలిపోయాయి.

ఆకునూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

గుర్రాలగొందిలో తడిసిన ధాన్యం

నర్సాయపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 19: బెల్ట్‌షాపుపై టాస్క్‌ఫోర్స్, పోలీసులు ఏకకాలంలో దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు వివరాల ప్రకారం.. రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా ఆనంద్ అనే వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడనే సమాచారంతో సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశామన్నారు. 9.770 లీటర్ల బీర్,విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకొని బెల్ట్‌షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీజేపీ అభ్యర్థికి హైకోర్టు ఝలక్

సిద్దిపేట, ఏప్రిల్19: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఫిర్యాదు చేయడంతో ఎన్నికల సంఘం 106 మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేసింది. ఎన్నికల సంఘం విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.